నమస్తే తెలంగాణ
మెదక్
13 | హైదరాబాద్, బుధవారం 31 జనవరి 2024 | MEDAK


హుస్నాబాద్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గాంధీ స్ఫూర్తితో..

'స్వచ్ఛత' కొనసాగించాలి

పట్టణాలు, గ్రామాలు శుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్‌ను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సన్మానం

హుస్నాబాద్, జనవరి 30: జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో పట్టణాలు, గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను కొనసాగించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను సన్మానించి కొత్తబట్టలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా గుర్తించాలన్నారు. హుస్నాబాద్ పట్టణాన్ని కాలుష్య రహిత, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా కార్యక్రమాలను సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడు పల్లెలు, పట్టణాలు సస్యశ్యామలంగా, పరిశుభ్రంగా విలసిల్లుతాయన్నారు. వాడవాడలా చెత్త సేకరణ చేసి పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. హుస్నాబాద్ పట్టణానికి ఇప్పటి వరకు మూడు జాతీయ స్థాయి అవార్డులు రావడం హర్షనీయమని, ఇందులో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం సన్మానం పొందిన పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు బోజు రమారవీందర్, జనగామ రత్నమాల, పెరుక భాగ్యరెడ్డి, వల్లపు రాజు, చిత్తారి పద్మ, భూక్య సరోజన, కోమటి స్వర్ణలత, నాయకులు ఆకుల వెంకట్, కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, ఎండీ హసన్, పున్న సది, అయిలేని శంకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్‌పై దాడి

గర్హనీయం

సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ

సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ

సిద్దిపేట, జనవరి 30: హామీలు చేయమని ప్రశ్నిస్తే అసహనంతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు దాడులకు దిగడం తగదని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ విమర్శించారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికారంలో ఉన్నామని కాంగ్రెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జడ్పీ చైర్మన్‌పై పోలీసులతో దాడి చేయించడం దారుణమన్నారు. సహాయ మంత్రి హోదాలో ఉన్న జడ్పీ చైర్మన్‌ను ఈ విధంగా అవమానించడం ప్రజాస్వామ్యానికి తగదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గుండా రాజకీయాలను మళ్లీ తెస్తున్నదని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలన అభివృద్ధి కేరాఫ్‌గా మారితే కాంగ్రెస్ పాలన గుండా రాజకీయాలకు మారుపేరుగా మారిందని విమర్శించారు.కేటీఆర్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ సైతం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో సైతం దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణ శర్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రోడ్డంతా తవ్వడంతో వాహనదారుల ఇబ్బందులు | నెలల తరబడి కల్వర్టుల నిర్మాణం.. వాటర్ క్యూరింగ్ కరువు | ఇష్టారాజ్యంగా పనులు... నామమాత్రంగా హెచ్చరిక బోర్డులు

సిద్దిపేట-హుస్నాబాద్-ఎల్కతుర్తి రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం

అంతంతమాత్రంగా అధికారుల పర్యవేక్షణ | విపరీతంగా దుమ్ము రేగడంతో అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు | పట్టించుకోని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు

సిద్దిపేట-హుస్నాబాద్ రహదారి విస్తరణ పనులు (మిట్టపల్లి నుంచి ముండ్రాయి గ్రామాల మధ్యన)

నత్తే నయం..!

సిద్దిపేట, జనవరి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట-హుస్నాబాద్-ఎల్కతుర్తి జాతీయ రహదారి (765 డీజీ) విస్తరణ పనులు నత్తనడక కొనసాగుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోడ్డును ఒకేసారి మొత్తం తవ్వి పనులు చేపడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిచోట్ల ఒక మార్గం పూర్తయ్యాక రెండో మార్గంలో రోడ్డును తవ్వారు. మరి కొన్ని చోట్ల రెండువైపులా ఒకేసారి రోడ్డును తవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిట్టపల్లి నుంచి రాజగోపాల్‌పేట వరకు మొత్తం రోడ్డును తవ్వేశారు. పాలమాకుల దాటిన తర్వాత బ్రిడ్జి నిర్మాణం 9 నెలలుగా చేస్తున్నా పూర్తి కాలేదు. చాలాచోట్ల నెలల తరబడి కల్వర్టుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం వచ్చేలోగా కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా..క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. కొన్నిచోట్ల సైడ్ డ్రైన్‌లు నిర్మిస్తున్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో చిన్నచిన్న కంకర రాళ్లు ఎగిరి పడుతున్నాయి. ఇటీవల కంకర రాయి ఎగిరి వచ్చి ఓ ప్రయాణికుడికి తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. దుమ్ము విపరీతంగా లేస్తుండడంతో ప్రయాణికులు అనారోగ్య సమస్యలు చోటుచేసుకుంటుడడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. సరిగ్గా వాటర్ క్యూరింగ్ చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దుమ్ముతో వాహనాలు వెళ్లినప్పుడు ఎదురెదురుగా టూవీలర్ వంటి వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

దుమ్మురేగుతున్న సిద్దిపేట-హుస్నాబాద్ రహదారి

రాంపూర్ క్రాసింగ్ దాటిన తర్వాత ప్రమాద కరంగా సైడ్ డ్రైన్ పనులు

నాణ్యతకు తిలోదకాలు...

రోడ్డు నిర్మాణంతో నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలివేశారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. డివైడర్లు, సైడ్ డ్రైన్‌లకు సరిగ్గా వాటర్ క్యూరింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిగా పనులు చేపడుతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట రంగధాంపల్లి బ్రిడ్జి నుంచి హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి వరకు బస్వాపూర్, సముద్రాల, పందిల్ల, హుస్నాబాద్, పోతారం(ఎస్) జిల్లెల గడ్డ, ముల్కనూరు, కొత్తపల్లి, ఇంద్రానగర్, ఎల్కతుర్తి గ్రామాల మీదుగా హన్మకొండ- కరీంనగర్ జాతీయ రహదారికి ఈ రోడ్డు కలుస్తుంది. ఈ రహదారి విస్తరణలో పెద్ద బ్రిడ్జిలు 2 బస్వాపూర్, పందిల్ల, మైనర్ బ్రిడ్జిలు 26, పైప్ కల్వర్టులు 29, స్లాబ్ కల్వర్టులు 29 ఏర్పాటు చేయాల్సి ఉంది. చాలాచోట్ల బ్రిడ్జిల నిర్మాణం నత్తనడక కొనసాగుతున్నది.

ఏడాది కిందట పనులు ప్రారంభం...

సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి (765 డీజీ) పనులు ఏడాది కిందట ప్రారంభంచారు. మెదక్-సిద్దిపేట ఒక బిట్టుగా, సిద్దిపేట- ఎల్కతుర్తి వరకు రెండో బిట్టుగా రహదారిని విభజించారు. సిద్దిపేట-ఎల్కతుర్తి 63.641 కిలోమీటర్ల రహదారికి రూ. 578.85 కోట్లు, మెదక్ నుంచి సిద్దిపేట వరకు రహదారి విస్తరణకు 70 కిలోమీటర్లకు రూ. 882 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఈ జాతీయ రహదారి 765 డీజీ 134 కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. ఇందులో రెండు టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేస్తారు.వీటిలో ఒకటి మెదక్ జిల్లా పోతారెడ్డిపేట నుంచి నిజాంపేట మధ్యలో, రెండోది సిద్దిపేట జిల్లా పందిల్ల వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేస్తారు. ఈ రహదారి విస్తరణతో మెదక్, సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ, వరంగల్ తదితర జిల్లాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఈ రోడ్డు విస్తరణలో అడ్డంకులను కేసీఆర్ ప్రభుత్వం తొలిగించి పనుల్లో వేగం పెంచింది. ఈ రోడ్డు విస్తరణ పనులు స్పీడ్‌గా జరుగుతున్న సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ రోడ్డు పనుల పురోగతిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సిద్దిపేట -హుస్నాబాద్ రహదారి విస్తరణలో భాగంగా పాలమాకుల గ్రామం దాటిన తర్వాత నెలల తరబడి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

'మల్లన్న' లష్కర్ వారం

ఆదాయం రూ.59,71,343

చేర్యాల, జనవరి 30 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి లష్కర్ వారం ఆదాయం రూ.59,71,343 వచ్చినట్లు ఆలయ ఈవో ఎ.బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా శనివారం రూ.5,97, 344, ఆదివారం రూ.45,22,202, సోమవారం రూ.8, 51,797 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ,20,93,123 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. సమావేశంలో ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్,కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు ఉన్నారు.

నాణేలతో గాంధీ చిత్రపటం

నాణేలతో

మహాత్మాగాంధీ చిత్రం

గజ్వేల్, జనవరి 30: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామరాజు చిన్న పది పైసల నాణేలతో అద్భుతంగా గాంధీ చిత్రపటాన్ని మంగళవారం రూపొందించాడు.

కార్పొరేట్‌కు దీటుగా

సర్కార్ విద్య

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 30: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కార్ విద్యను అందజేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామంలో రూ.కోటి 20లక్షలతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం, రూ. 60లక్షలతో వీకర్‌సెక్షన్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయంలో మన ఊరు- మన బడి పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించుకున్నామన్నారు. పాఠశాలల్లో అత్యుత్తమమైన శిక్షణను అమలులోకి తీసుకొచ్చామన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులుండటంతో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు సైతం ఉత్తమంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో అద్భుతమైన వసతులను కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా తయారు చేశామన్నారు. బడుగు,బలహీన వర్గాల పిల్లలు చక్కగా చదువుకొని రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ధరణీఅంతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, అంతిరెడ్డి పాల్గొన్నారు.

రామేశ్వరంబండలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఇండ్ల కోసం

రోడ్డెక్కారు

గజ్వేల్, జనవరి 30: బీఆర్ఎస్ సర్కారు హయాంలో కేటాయించిన ఇండ్లను తమకు అప్పగించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం రెండు గంటల పాటు లబ్ధిదారులు ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ సమీపంలో బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో అర్హులను ఎంపిక చేసి లక్కీ డ్రా పద్ధతిలో 1100 మందిని ఎంపిక చేశారు. కాగా, వాటిని మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు చెందిన వారికి తాత్కాలికంగా కేటాయించారు. లక్కీ డ్రాలో కేటాయించిన ఇండ్లను తమకు అప్పగించాలపి లబ్ధిదారులు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టగా ట్రాఫిక్ జాం అయ్యింది. గజ్వేల్ ఏసీపీ రమేశ్ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని లబ్ధిదారులకు నచ్చజెప్పారు. వారు వినకపోవడంతో ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ బాల్‌రాజు చేరుకుని సముదాయించారు. పూర్తి విచారణ చేసి లక్కీ డ్రాలో కేటాయించిన వారికి ఇండ్లు కేటాయిస్తామని ఆర్డీవో చెప్పినప్పటికీ వినకుండా ఆందోళన చేశారు. రెండు గంటల పాటు ఆందోళనతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అధికారులు మరోసారి సముదాయించడంతో ఆందోళనకారులు విరమించారు.వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ వాహనాలను క్లియర్ చేశారు. సీఐలు సైదా, లతీఫ్, మహేందర్ రెడ్డి, తిరుపతి, ఎస్సైలు బందోబస్తులో పాల్గొన్నారు.

గజ్వేల్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్, ఏసీపీ రమేశ్

తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ

- ప్రతి ఒక్కరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- మాసాయిపేట, కొప్పులపల్లిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

వెల్దుర్తి, జనవరి 30: వీరవనిత చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో మంగళవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని, ప్రాథమిక సహకార సంఘం దుకాణ సముదాయాన్ని, కొప్పులపల్లిలో మనఊరు-మనబడిలో భాగంగా రూ. 64.50 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ ఐలమ్మ భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా కొట్లాడి మహిళలు, బహుజనుల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయురాలు ఐలమ్మ అని కొనియాడారు. అలాంటి వీరవనిత ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. అంతకుముందు రజక సంఘం నాయకులు మాట్లాడుతూ 50 ఏండ్లు నిండిన రజకులకు పింఛన్లతో పాటు ప్రమాదబీమాను వర్తింపజేయాలని, ఐలమ్మ చరిత్రను పుస్తకాల్లో ముద్రించాలని సభలో ప్రస్తావించగా, స్పందించిన ఎమ్మెల్యే రజకుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 నుంచి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. వెల్దుర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో దుకాణాలను నిర్మించడం అభినందనీయమని, 'మనఊరు-మనబడి' పథకంలో పాఠశాలలు మరింత అభివృద్ధి చెంది, అన్ని సౌకర్యాలు సమకూరుతున్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూపా నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, కనకమ్మ, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంపీడీవో వెంకటలక్ష్మి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి, మండల అధ్యక్షుడు సోమేశ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి. పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి

బీఆర్ఎస్ హయాంలో క్రీడలకు ప్రోత్సాహం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సీనియర్ బాలికల ఖోఖో క్రీడాపోటీలు

గజ్వేల్ అర్బన్, జనవరి 30: క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా గజ్వేల్ పట్టణం మారిందని, కేసీఆర్ పాలనలో క్రీడాకారులకు తగిన గుర్తింపు లభించిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఖోఖో క్లబ్ ఆధ్వర్యంలో గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సీనియర్ బాలికల ఖోఖో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడాపోటీలను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టణంలో రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఖోఖో క్రీడాపోటీల్లో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి 17 టీమ్‌లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో జగదేవ్‌పూర్ మండలం తీగుల్ జడ్పీహెచ్ పాఠశాల జట్టు నిలువగా, రెండో స్థానంలో సంగారెడ్డి జిల్లా కృష్ణాపూర్ పాఠశాల జట్టు నిలిచింది. క్రీడాపోటీల్లో 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాపోటీలకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీ యెద్దీన్‌కు పీఈటీ ఎలియాస్ రావు ఖోఖో క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.


గజ్వేల్‌లో ఖోఖో క్రీడాకారులతో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రామమౌళి